క్లుప్తంగా

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



మైక్‌సెట్ అందిస్తున్న సభ్యులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణం ఎస్సీ కాలనీలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ వవారు రూ.10వేలు విలువైన చార్జబుల్ మైక్‌సెట్‌ను బహూకరించారు. అసోసియేషన్ 13వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్‌కు మైక్‌సెట్‌ను గ్రీన్‌మేకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ మేకర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్, సభ్యులు రవికిరణ్, మల్లేశ్, లక్ష్మణ్, నర్సింహ, రంగారావ్, దినేశ్, చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

గ్రామాభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే కసిరెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తలకొండపల్లి: గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేసి సహకరించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేణురెడ్డి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు. గురువారం ఆయన నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో కసిరెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గట్టుఇప్పలపల్లిలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక నిధులివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేణురెడ్డి, అంజయ్య, నరేందర్‌గౌడ్, మైసయ్య, రామచంద్రయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి



ఇంజాపూర్ రోడ్డుపై పారుతున్న మురుగు

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపాలిటీ సాగర్ రహదారి నుంచి ఇంజాపూర్‌లోకి వెళ్లే రోడ్డుపైన డ్రైనేజీ పొంగిపొర్లుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు. దీంతో వాహనదారులు, స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతు కుటుంబాలకు అండగా ఉంటాం

బాటసింగారం రైతుసేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న విఠల్‌రెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: సహకార సంఘం పరిధిలోని ప్రతి రైతు కుటుంబానికి అండగా ఉంటామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కవాడిపల్లికి చెందిన సంఘం సభ్యుడు మెరుగు శ్రీధర్ నవంబర్ 16న మృతి చెందడంతో సంఘం తరుపున మృతుడి కుటుంబానికి గురువారం రూ.25వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, మేనేజర్ ఐలేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

24న ఇంజినీర్స్ కమిటీ సర్వసభ్య సమావేశం

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ సంక్షేమ సంఘం సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నట్టు కాలనీ సమన్వయకమిటీ కో కన్వీనర్ వి.ఆల్వాల్‌రెడ్డి వెల్లడించారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు కోసం రెండు సార్లు సమావేశాలు నిర్వహించినా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో ఈనెల 24న జనరల్ బాడీ మీటింగ్ ఏర్పాటు చేశామన్నారు. కాలనీ సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. విశ్వేశ్వరయ్య ఇంజినీర్స్ కాలనీ కమిటీ తీర్మానం మేరకు నూతన కమిటీని ఏర్పాటు చేయడానికి నిర్వహించే కాలనీ సర్వసభ్య సమావేశానికి సభ్యులు తప్పక హాజరుకావాలని కోరారు. నూతన కమిటీ ఏర్పాటుకు కాలనీ ప్రతినిధులు సహకరించాలని స్పష్టం చేశారు. కాలనీ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, సమన్వయ కమిటీ సభ్యులు నర్సిరెడ్డి పాల్గొన్నారు.

కాలినడకే శరణ్యమా..?

- బీటీకి నోచుకోని మైసిగండి–గోవిందాయిపల్లి రోడ్డు
- గ్రామానికి ఆర్టీసీ బస్సులు, ఆటోలు నడవని పరిస్థితి
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



మైసిగండి-గోవిందాయిపల్లి మట్టిరోడ్డు

కడ్తాల్: శ్రీశైలం–హైదరాబాద్ జాతీయ రహదారిపై మైసిగండి గ్రామం నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉండే గోవిందాయిపల్లి గ్రామానికి రహదారి సక్రమంగా లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మట్టిరోడ్డు ఉండటంతో ఆర్టీసీ బస్సులు, ఆటోలు గ్రామానికి రావడం లేదు. గ్రామస్తులు హైదరాబాద్, కల్వకుర్తి తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే మైసిగండి వరకు కాలినడకన రావాల్సిన పరిస్థితి. బీటీ రోడ్డు నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కర్కల్‌పహాడ్ గ్రామ పంచాయతీలో ఉన్న గోవిందాయిపల్లి.. నూతన గ్రామ పంచాయతీగా ఏర్పడింది. గ్రామానికి వెళ్లే ప్రధాన మట్టి రోడ్డు గుంతలుగా, ఎగుడుదిగుడుగా ఉండటంతో కనీసం బైక్‌లు వెళ్లేందుకు కూడా ఇబ్బందిగా ఉంది. ప్రత్యేకంచి వర్షాకాలంలో రోడ్డు పూర్తిగా చిత్తడి అవడంతో కాలినడకన కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది.

బీటీరోడ్డు వేస్తే...

మైసిగండి నుంచి గోవిందాయిపల్లి మీదుగా ఎక్వాయిపల్లి వరకు బీటీ రోడ్డు నిర్మించాలని అలాగే ఆర్టీసీ బస్సులు కూడా నడపాలని ప్రజలు కోరుతున్నారు. అదే విధంగా ఎక్వాయిపల్లి నుంచి గోవిందాయిపల్లి మీదుగా మైసిగండి వరకు బీటీ రోడ్డు ఏర్పాటు చేస్తే మండల కేంద్రానికి దూర భారం తగ్గుతుంది. రవాణా సదుపాయం మెరుగుపడుతుంది. మైసిగండి నుంచి గోవిందాయిపల్లి, ఎక్వాయిపల్లి, మీదుగా బీటీ రోడ్డు నిర్మాణం చేపడితే మండల పరిధిలోని చరికొండ, ముద్విన్, ఎక్వాయిపల్లి గ్రామాల ప్రజలకు, మండల కేంద్రానికి సుమారు 4 కిలోమీటర్ల దూర భారం తగ్గుతుంది. నూతన ప్రభుత్వంలోనైన గోవిందాయిపల్లి గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీ రోడ్డు వేయాలి



ఎక్వాయిపల్లి నుంచి గోవిందాయిపల్లి మీదుగా మైసిగండి గ్రామానికి బీటీ రోడ్డు వేస్తే కడ్తాల్‌కి వెళ్లేందుకు.. ఎక్వాయిపల్లి, ముద్విన్, చరికొండ గ్రామాల ప్రజలకు సుమారు 4 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. అదేవిధంగా బస్సు సౌకర్యం కల్పించాలి. అధికారులు స్పందించాలి.

– కృష్ణయ్య, ఎక్వాయిపల్లి

నిధులు మంజూరు చేయాలి



గోవిందాయిపల్లికి బీటీ రోడ్డు నిర్మించాలని ఏళ్లుగా కోరుతున్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు నిర్మిస్తే గ్రామస్తులకు, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉంటుంది. ఆర్టీసీ బస్సులు తిరుగుతాయి. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలి.

– ఎల్లాగౌడ్, ఉప సర్పంచ్, గోవిందాయిపల్లి

ప్రతిపాదనలు పంపించాం



మండల పరిధిలోని మైసిగండి నుంచి గోవిందాయిపల్లి వరకు, గోవిందాయిపల్లి నుంచి ఏక్వాయిపల్లి వరకు బీటీరోడ్డు ఏర్పాటుకు సంబంధించి ఏడాది క్రితమే ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాగానే రహదారి నిర్మాణ పనులు ప్రారంభిస్తాం

– పరమేశ్, పీఆర్ ఏఈ, కడ్తాల్

కాలనీ అభివృద్ధికి సహకరించండి



ఎమ్మెల్యే కసిరెడ్డికి ఆహ్వానపత్రిక అందిస్తున్న సభ్యులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లో ఆయన నివాసంలో గురువారం నియోజకవర్గ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈనెల 24న ఆమనగల్లు పట్టణంలోని విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం నిర్వహించే సమావేశానికి రాగలరని ఎమ్మెల్యే కసిరెడ్డిని ఆ సంఘం అధ్యక్షుడు పాషా ఆహ్వానపత్రిక అందించారు. కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సుదర్శన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ఆరీఫ్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆమనగల్లు మండలం రాంనుంతల గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ.2లక్షల చెక్కును ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు.

పేదింటి యువతి వివాహానికి చేయూత



యువతి వివాహానికి ఆర్థికసాయం అందజేస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

తలకొండపల్లి: నిరుపేద యువతి వివాహానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి ఆర్థికసాయం అందజేశారు. మండల పరిధిలోని మాదాయిపల్లికి చెందిన మణెమ్మ, యాదయ్య దంపతుల కూతురు రజిత వివాహానికి ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఆయన గురువారం పార్టీ నాయకులకు చెప్పి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఇటీవల మృతి చెందిన ఆయిల్ రాఘవేందర్ కుటుంబానికి రూ.3వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యుడు అంబాజీ, ఉప సర్పంచ్ అజీజ్, మైనార్టీసెల్ అధ్యక్షుడు ఆరిఫ్, రవికుమార్, ఆంజనేయులు, ఎల్లయ్య, రామస్వామి, అశోక్, రవి, అంజయ్య, దశరథం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల కమిటీ ఎన్నిక



నియామకపత్రం అందుకుంటున్న వెంకటరమణ

కడ్తాల్: ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడిగా కడ్తాల్‌కి చెందిన వెంకటరమణ నియమితులయ్యారు. మండల కేంద్రంలో ఆ సంఘం కల్వకుర్తి ఇన్‌చార్జి యాదగిరి మాదిగ ఆధ్వర్యంలో గురువారం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా మహేశ్, కార్యదర్శిగా శ్రీకాంత్‌తో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ.. ఎమ్మార్పీఎస్ టీఎస్ మాదిగ దండోరా జాతీయ అధ్యక్షుడు మేడి పాపన్న ఆదేశాల మేరకు కమిటీని ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. అనంతరం నూతన కమిటీకి నియామకపత్రాలు అందజేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సాక్షి ఎఫెక్ట్..



కూల్చివేతల అనంతరం ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డు

పహాడీషరీఫ్: కబ్జాలపై ఎట్టకేలకు అధికారులు కన్నెర్ర చేశారు. మండల పరిధిలోని మామిడిపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న వైనంపై 'సాక్షి' దినపత్రికలో 'యథేచ్ఛగా కబ్జాల పర్వం' అనే శీర్షికన గురువారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి బాలాపూర్ రెవెన్యూ అధికారులు స్పందించారు. తహసీల్దార్ మాధవిరెడ్డి ఆదేశాలతో ఆర్.ఐ జమీల్ గురువారం ఉదయాన్నే కబ్జాకు గురైన సర్వే నంబర్ 99/1లోని స్థలానికి చేరుకొని పహాడీషరీఫ్ పోలీసులు, జల్‌పల్లి మున్సిపాలిటీ, విద్యుత్ అధికారుల సహకారంతో జేసీబీలతో కూల్చివేతలు చేపట్టారు. అనంతరం ఆ స్థలంలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. హౌజింగ్ బోర్డుకు కేటాయించిన భూమిలో అర ఎకరం మేరకు నిర్మాణాలు చేపట్టారని, ఇందులో పది వరకు నిర్మాణాలను కూల్చామని తహసీల్దార్ మాధవిరెడ్డి తెలిపారు. మిగిలిన నిర్మాణాలను కూల్చివేస్తామన్నారు. మండల పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాల బారిన పడకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కబ్జారాయుళ్లపై అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములు, చెరువులను ఆక్రమించేవారిని ఉపేక్షించేది లేదని ఎంతటివారైనా చర్యలు తప్పవన్నారు. కబ్జాలపై అధికారులకు సమాచారం ఇవ్వాలని స్థానికులను కోరారు. సమాచారం ఇచ్చినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. కూల్చివేతలను అడ్డుకోవడం కూడా చట్టరీత్యా నేరం అన్నారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ

- ట్రిప్పులను తగ్గించిన అధికారులు
- ఇబ్బందులు పడిన ప్రయాణికులు



బస్సు ఎక్కేందుకు ఎగబడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

యాచారం: మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ బస్సులు రద్దీగా మారాయి. ఆర్టీసీ అధికారులు కూడా కొన్ని బస్సుల ట్రిప్పులను రద్దు చేశారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపో నుంచి యాచారం మండలంలోని నక్కర్తమేడిపల్లి గ్రామం మీదుగా నానక్‌నగర్, తాడిపర్తి, పల్లెచల్కతండా వరకు, మాల్ నుంచి మంతన్‌గౌరెల్లి వరకు, అదే విధంగా మొండిగౌరెల్లి, కొత్తపల్లి, నల్లవెల్లి తదితర గ్రామాలకు బస్సుల ట్రిప్పులను రద్దు చేసింది. సాగర్‌రోడ్డుపై దేవరకొండ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సులు ప్రతి పావు గంటకు ఒక బస్సు చొప్పున రాకపోకలు సాగించేది. ప్రస్తుతం దేవరకొండ డిపోకు చెందిన బస్సులు అరగంట దాటినా కూడా రావడం లేదు. ఉచిత ప్రయాణం, బస్సులు కూడా తగ్గించడంతో ప్రయాణికుల రద్దీ అధికంగా మారింది. సమయానుకులంగా బస్సులు రాకపోవడంతో యాచారం, మాల్ కేంద్రాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్టీసీ అధికారులు అన్ని గ్రామాలకు గతంలో మాదిరిగా బస్సులు నడిపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఘనంగా ఇరుముడి పూజ



ఇరుముడి కట్టుకుంటున్న అయ్యప్ప మాలధారణ స్వాములు

యాచారం: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి ఇరుముడి పడిపూజను గురువారం వైభవంగా నిర్వహించారు. కుమ్మరిగూడెం పురుషోత్తం 18వ సారి అయ్యప్ప మాలధారణ పూర్తికావడం, అదేవిధంగా 30మంది అయ్యప్పస్వామి మాల ధరించిన వారు ఇరుముడి కట్టుకుని శబరిమలకు బయలుదేరారు. ఈ సందర్భంగా తిరుమల దేవునిగుట్ట సమీపంలోని అయ్యప్ప స్వామి సేవా సమితి క్షేత్రంలో చందర్‌నాయర్ గురుస్వామి పర్యవేక్షణలో నారాయణశెట్టి గురుస్వామి ఆధ్వర్యంలో ఇరుముడి పూజను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పు భాషా, రాష్ట్ర నాయకుడు రవీందర్‌రెడ్డి తదితరులు హాజరై ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మాలధారణ చేసిన అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం నిర్వహించారు.

గుడిసెవాసులకు న్యాయం చేస్తాం



గుడిసెవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్: జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు పక్కన వేసుకున్న నివాసాలు కోల్పోతున్న వారికి తగిన న్యాయం చేస్తామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్‌లోని రేడియో స్టేషన్ పక్కన గుడిసెలు వేసుకొని ఉంటున్న వారు నివాసాలు కోల్పోతున్నారని తెలుసుకున్న ఆయన అక్కడికి వెళ్లి బాధితులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గతంలో క్రీడా పక్కన గుడిసెలు ఉండగా, అక్కడ బస్ టెర్మినల్ ప్రతిపాదన రావడంతో అక్కడి నుంచి గుడిసెలను ఇక్కడికి తరలించామన్నారు. వారికి కనీస సౌకర్యాలు కల్పించామని, వారు వ్యాపారం చేసుకునే విధంగా సహకరించామన్నారు. ఉన్నఫలంగా వారిని ఖాళీ చేయమని అధికారులు గుడిసెలను తొలగిస్తున్నారన్నారు. వారికి న్యాయం చేయాలని గతంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, మరోసారి కలెక్టర్‌తో మాట్లాడి తగిన న్యాయం చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఆర్థికసాయం అందజేత

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని ఉదయనగర్ కాలనీకి చెందిన మారోజు గోదావరమ్మ గురువారం మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులను ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నాగిళ్ల జగన్ పరామర్శించి ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3 వేలను అందించారు. ఈ కార్యక్రమంలో పురుషోత్తం, వినోద్, శేఖర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

బడంగ్‌పేట్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని కార్పొరేషన్ పరిధి నాదర్‌గుల్ స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల ఎకో క్లబ్ విద్యార్థులు అన్నారు. ప్రజలకు కాలుష్యంపై అవగాహన కల్పించేందుకు ఎకో క్లబ్ విద్యార్థులు 20 ఎలక్ట్రిక్ వాహనలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో 40 మంది సభ్యులు కళాశాల నుంచి బడంగ్‌పేట్, నాదర్‌గుల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని కళాశాల కార్యదర్శి ఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. కాలుష్యం మితిమీరితే ప్రకృతి విలయతాండవాన్ని ఆపలేమన్నారు. ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున మొక్కలు నాటాలన్నారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. విద్యార్థులు ఇళ్లకి వెళ్లి మొక్కల ఆవశ్యకతను తల్లిదండ్రులకు వివరించాలన్నారు. హరితహారం ద్వారా పెద్ద సంఖ్యలో మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళికలు రచించాలన్నారు. పెద్ద సంఖ్యలో మొక్కలు పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.వెంకటకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ డా.మహేశ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కూల్‌డ్రింక్స్‌తో నాడీ వ్యవస్థకు ముప్పు

లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి



మందులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ నిర్వాహకులు

కందుకూరు: ప్రతీ ఒక్కరు కాల్షియం సమృద్ధిగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా వైస్ గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి సూచించారు. లయన్స్‌క్లబ్ కందుకూరు అధ్యక్షుడు నిమ్మ అంజిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని భూలక్ష్మి ఆస్పత్రిలో కీళ్ల నొప్పులు, న్యూరో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఆధునిక జీవన విధానంలోని ఆహార అలవాట్ల వల్ల ఎముకలకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు. పాలు, పెరుగు వాడకం తగ్గడం.. కూల్‌డ్రింక్స్ వినియోగం పెరగడంతో ఎముకల పటిష్టత, నాడీ వ్యవస్థకు ముప్పు వాటిల్లుతోందన్నారు. కాల్షియం ఉండే పాలు, ఆకుకూరలు, గుడ్లు, క్యాబేజీ, కాలిఫ్లవర్, నువ్వులు తదితరాలు ఆహారంలో ఉండేట్లు చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కందుకూరు మాజీ అధ్యక్షుడు తాళ్ల అంజయ్య, బైరు కొండల్‌రెడ్డి, టంకరి కేశవరెడ్డి, సురసాని వెంకట్‌రంగారెడ్డి, గంట రాంరెడ్డి, కార్యదర్శి కె.వెంకటేశ్వర్లుగుప్తా, కోశాధికారి జి.రామస్‌బాబు, దేశం సత్తిరెడ్డి, దేశం మోహన్‌రెడ్డి, ఎండీ అజీజ్, వైద్య సిబ్బంది శ్యామూల్, శ్రీనివాస్, మాన్‌కైండ్ కంపెనీ ప్రతినిధులు శ్రీకాంత్, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటును అడ్డుకోవడంతో ఉద్రిక్తత



వంగవీటి మోహన రంగా విగ్రహ ఏర్పాటు పనులను అడ్డుకున్న బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు

వనస్థలిపురం: వనస్థలిపురంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమీపంలో మహాత్మా బసవేశ్వర విగ్రహం వద్ద ఏపీకి చెందిన దివంగత నేత వంగవీటి మోహన రంగా విగ్రహాన్ని ప్రతిష్టించేందుకు కొందరు గురువారం పనులు ప్రారంభించగా, మహాత్మా బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు అడ్డుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బసవేశ్వరుని విగ్రహం వద్ద మరో విగ్రహాన్ని ఎలా పెడతారంటూ వారు అభ్యంతరం చెప్పారు. దీంతో స్థానికంగా ఉద్రిక్తత నెలకొనగా, సమాచారం అందుకున్న వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ జలంధర్‌రెడ్డి తన సిబ్బందితో అక్కడకు చేరుకున్నారు. దిమ్మె నిర్మాణానికి పూనుకున్న వారిని అక్కడి నుంచి పంపించి వేశారు. అనుమతులు లేకుండా ఎలాంటి విగ్రహాలు పెట్టడానికి వీలులేదని ఇన్‌స్పెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయంపై పోలీసులకు, తహసీల్దార్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశామని బసవేశ్వర సేవా సంఘం ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బసవేశ్వర సేవా సంఘం అధ్యక్షుడు ఎం.ప్రభాకర్, ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కుశాల్ కుమార్, సంయుక్త కార్యదర్శి సంతోష్ నీలకంఠ, ఎం.ఎస్.కుమార్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.